క్లుప్తంగా

నిత్యాన్నదానానికి భక్తుల విరాళాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి భక్తుల నుంచి విరాళాలు వెల్లువెత్తుతున్నట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. నిడదవోలుకు చెందిన కె.నాగవెంకట మెహర్‌బాబు-జ్ఞాననాగ సింధూర దేవి దంపతులు రూ.11,116, కైకలూరుకు చెందిన ఎస్.నాగు-శాంతి దంపతులు రూ.10,116, రాజమహేంద్రవరానికి చెందిన ఎ.జాహ్నలీల రూ.10,116, ఆత్రేయపురానికి చెందిన ఎం.సీతారామరాజు రూ.10,116, తాడేపల్లిగూడేనికి చెందిన పి.శశిరేఖ రూ.10,116, విరాళాలు అందించినట్లు తెలిపారు. దాతలకు ఆలయ చైర్మన్ రమేష్‌రాజు చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందించారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే వైద్య శిబిరాలను రోగులు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని ప్రముఖ వైద్యుడు పి.చంద్రశేఖరరెడ్డి అన్నారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో ఉన్న సామాజిక భవనంలో మాచవరానికి చెందిన ఆదిత్య హాస్పిటల్ నిర్వాహకుడు ముషిణి సురేష్ బాబు, కల్వకొలను చిన్నాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరంలో రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం



జగ్గన్నపేటలో జరిగిన సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మామిడికుదురు: మొగలికుదురు గ్రామ పరిధిలోని జగ్గన్నపేటలో ఆదివారం జరిగిన సమావేశంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను చౌడేశ్వరి సేవా సమితి తరఫున ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈదరాడకు చెందిన ఉపాధ్యాయుడు జానసాగర్ మాట్లాడుతూ విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న అంశాలపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం ఇటీవల జరిగిన పరీక్షల్లో సత్తా చాటిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు.

దేశం విశ్వగురువుగా ఖ్యాతికెక్కాలి

ఆలమూరు: దేవుని కృపతో భారతదేశం గొప్ప విశ్వగురువుగా ఖ్యాతికెక్కాలని మండపేటకు చెందిన శ్రీఅమ్మా భగవాన్ భక్తబృందం ప్రత్యేక పూజలు నిర్వహించింది. గుమ్మిలేరులోని రామాలయం వద్ద శనివారం రాత్రి శ్రీఅమ్మా భగవాన్ భక్తబృందం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సర్పంచ్ గుణ్ణం రాంబాబు దంపతులు హాజరై భక్తులకు పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు డి.సుబ్బారావు, కె.పద్మ, వీఆర్వో డి.అమ్మాజీ పాల్గొన్నారు.

17న ఉచిత మెగా వైద్య శిబిరం

కొత్తపేట: యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 17న అమలాపురం సర్ సీవీ రామన్ స్కూల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు జిల్లా కార్యదర్శి వై.మురళి, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు టి.విజయకృష్ణ తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాజానగరం జీఎస్‌ఎల్ ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించే ఈ శిబిరంలో గుండె, క్యాన్సర్, న్యూరో, యూరాలజీ, గైనకాలజీ తదితర వ్యాధులకు సంబంధించి స్పెషలిస్టులతో పరీక్షలు, వైద్య సేవలు ఉచితంగా అందించనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లు, ప్రజా సంఘాలు, సంఘటిత, అసంఘటిత కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఈ వైద్య సేవలు పొందవచ్చని తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్య సేవలు అందిస్తారన్నారు. పై రంగాల్లో ఉన్న వారంతా సంపూర్ణ ఆరోగ్యం కోసం ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ముందస్తు రిజిస్ట్రేషన్ తమను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో కొత్తపేట మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేపీసీహెచ్ సూర్యారావు, జి.రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు కొత్తపేటకు చెందిన వై.మురళీమోహన్ సెల్ నంబర్ 9490064546కు సంప్రదించాలని కోరారు.

నేడు ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష

కొత్తపేట: నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలుపై ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సోమవారం ఉదయం 9 గంటలకు రావులపాలెం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్టు ఏడీఏ ఎం.వెంకటరామారావు తెలిపారు. ఆర్‌డీఓ ఎం.ముక్కంటితో కలసి నిర్వహించే ఈ సమావేశంలో నాలుగు మండలాల తహసీల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొంటారని తెలిపారు.

బలహీనంగా వైనతేయ కుడి కరకట్ట

- వరదొస్తే ఉరుకులు పరుగులు
- అక్రమ కట్టడాలతో ఆందోళన



పెదపట్నం-మానేపల్లి సరిహద్దులో ఏటిగట్టుపై అక్రమంగా నిర్మించిన కట్టడాలు



పాశర్లపూడిబాడవలో ఊటలు పడి ఆందోళన కలిగిస్తున్న కరకట్ట

మామిడికుదురు: వైనతేయ గోదావరి కుడి కరకట్ట బలహీనంగా ఉండడం, ఏటిగట్టుపై అక్రమ కట్టడాలు వెరసి విస్తరణ పనులకు ఆటంకం కలిగిస్తున్నాయి. స్థానికులను మరింత ఆందోళనకు గురి చేస్తోంది. దీనిపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. గత పాలకులు ఏటిగట్టు అభివృద్ధిని నిర్లక్ష్యం చేయడం ప్రజలకు శాపంగా మారింది. చాలా కాలం పెండింగ్‌లో ఉన్న ఏటిగట్టు విస్తరణ పనులు ఓ కొలిక్కి రాకపోవడం కరకట్ట ఎగువ ప్రాంతాల ప్రజలను కలవరపెడుతోంది. ఏటిగట్టు బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో అయినా దానిని పటిష్టం చేస్తారని ప్రజలు ఆశించారు. ఈ వేసవిలో అయినా పనులు చేపడతారని ఎదురు చూశారు. ఆ దిశగా అడుగులు పడకపోవడం, భారీ వర్షాలు, వరదల సమయం ఆసన్నం కావడంతో ఏటిగట్టు పరిస్థితిపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో ఏటిగట్టు విస్తరణలో భాగంగా వేసిన మట్టి భారీ వర్షాలకు పలు చోట్ల అండలుగా జారిపోయింది. మట్టి కొట్టుకుపోయిన ప్రాంతాల్లో గత ఏడాది వరద నీరు లీకవడం కలవరపెట్టింది. వీక్ పాయింట్ల వద్ద గోదావరి సమయంలో ఇసుక బస్తాలు వేసి తాత్కాలిక రక్షణ చర్యలు చేపట్టారు. అటువంటి ప్రాంతాల్లోనూ ఏటిగట్టు బలోపేతం చేసే దిశగా ఏ పనులు చేపట్టకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

28 కిలోమీటర్లు.. రూ.33 కోట్లు నిధులు..

పి.గన్నవరం మండలం లంకల గన్నవరం నుంచి మామిడికుదురు మండలం గోగన్నమఠం వరకు 28 కిలోమీటర్ల మేర కుడి కరకట్ట విస్తరించి ఉంది. 1986లో రికార్డు స్థాయిలో వచ్చిన వరదల స్థాయికి తట్టుకునే విధంగా ఏటిగట్టును ఆధునీకరించేందుకు గతంలో రూ.33 కోట్ల నిధులు మంజూరు చేశారు. అప్పట్లో విస్తరణ పనులకు మంజూరైన నిధులను పూర్తి స్థాయిలో వ్యయం చేయలేదు. ఏటిగట్టు విస్తరణ పనుల్లో ఆదుర్రులోని 22వ కిలో మీటర్ నుంచి గోగన్నమఠంలోని 28వ కిలో మీటరు వరకు మాత్రమే పనులు పూర్తి చేశారు. మిగిలిన 21 కిలో మీటర్లలో అరకొరగా పనులు నిర్వహించారు. మధ్యమధ్యలో పనులు నిలిచిపోవడంతో విస్తరణ పనుల్లో ఎటువంటి ముందడుగు పడలేదు.

ఆక్రమణల తొలగింపు కత్తిమీద సామే...

ఏటిగట్టు విస్తరణ పనులు పూర్తి చేసేందుకు ఉన్న ఆటంకాలను తొలగించే దిశగా ఏ విధమైన చర్యలు తీసుకోలేదు. కొన్ని గ్రామాల్లో ఏటిగట్టును ఆనుకుని నిర్మించిన అక్రమ పక్కా భవనాలను, ఆలయాలను తొలగించాల్సి ఉంది. వీటిని తొలగించడం అధికారులకు కత్తిమీద సాముగా మారింది. ఈ తొలగింపు పూర్తి కాకపోవడంతో ఏటిగట్టు విస్తరణ పనులు గతంలో అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, ఇరిగేషన్, ట్రాన్స్‌కో తదితర శాఖలు సమన్వయంతో ఆక్రమణల తొలగింపు చేపట్టాల్సి ఉంది. కానీ ఈ శాఖల అధికారుల మధ్య సమన్వయం లోపం ప్రధాన సమస్యగా మారింది. ఈ అంశాలపై అధికారులు, ప్రజా ప్రతినిధుల్లో కూడా ఎటువంటి చలనం కనిపించడం లేదు. ఈ దిశగా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి ఆక్రమణలను తొలగించి ఏటిగట్టు ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా అమ్మవార్ల జాతరలు



కనక మహాలక్ష్మి



రావులమ్మ తల్లి



సత్తెమ్మతల్లి

ఆత్రేయపురం: గౌతమి గోదావరి తీరాన గ్రామంలో వేంచేసిన కనక మహాలక్ష్మి అమ్మవారి జాతర ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవార్ని దర్శించుకున్నారు. గ్రామ ఆడపడుచుగా ప్రసిద్ధి చెందిన అమ్మవారి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అమె సోదరి శ్రీమల్లమ్మ అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం రాత్రి గ్రామవీధుల్లో గరగనృత్యాలు, బ్యాండ్‌మేళాలు, బాజాభజంత్రీలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఇళ్ల వద్ద మహిళలు పసుపు, కుంకుమ, సారె, చీరలను అమ్మవారికి సమర్పించారు. చుట్టుపక్కల గ్రామాలైన తాడిపూడి, వసంతవాడ, ఉచ్చిలి, పులిదిండి గ్రామాల ప్రజలు జాతరకు తరలివచ్చారు. దీంతో వీధులు జనంతో కిటకిటలాడాయి. వేలాది మంది జాతరను తిలకించారు. అమ్మవారికి కుంకుమార్చన తదితర కార్యక్రమాలను భక్తులు ప్రత్యేక శ్రద్ధలతో నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఎస్సై సీహెచ్ సుధాకర్ ఆధ్వర్యాన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అంబాజీపేట: కె.పెదపూడిలో వేంచేసియున్న రాజేశ్వరి–రావులమ్మ అమ్మవారి జాతర మహోత్సవం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అమ్మవారి తీర్థ మహోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలను గత నాలుగు రోజుల నుంచి ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం అమ్మవారి తీర్థం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అదే రోజు అమ్మవారికి ఉయ్యాల సేవ నిర్వహించనున్నామన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: గ్రామంలోని ఆల్‌క్యాస్ట్ కాలనీలో కొలువుదీరిన సత్తెమ్మతల్లి జాతర ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. డప్పు వాయిద్యాలు, భక్తుల కోలాహలం నడుమ జాతర ఆద్యంతం కనుల పండువగా జరిపించారు. అమ్మ వారికి సోమవారం నైవేద్యాలు చెల్లిస్తారని ఉత్సవ కమిటీ తెలిపింది. ఈ నెల 19వ తేదీ శుక్రవారం వరకు జాతర జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. జాతరను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని పుష్పాలతో సుందరంగా అలంకరించారు. విద్యుత్ దీపాల వెలుగులతో ఆలయాన్ని ముస్తాబు చేశారు.

సేంద్రియ ఎరువులతో పొలాలకు సారం



మొసలపల్లిలో వరి చేలో ఉంచిన గొర్రెల మంద

అంబాజీపేట: సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా భూసారాన్ని పెంచుకోవడంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఎక్కువ దిగుబడుల కోసం అధికంగా రసాయన ఎరువులు వినియోగిస్తున్న తరుణంలో భూసారం క్షీణించి పైరును తెగుళ్లు కబళిస్తున్నాయి. అవగాహన లోపంతో ఎదురవుతున్న కష్టాలను తొలగించుకోవాలంటే సేంద్రియ ఎరువుల వినియోగం తప్పనిసరని అన్నదాతలు గుర్తిస్తున్నారు. మండలంలో వరి, కొబ్బరి, అరటి, కోకో తదితర పంటలు పండించే భూములకు గొర్రెలు, మేకలు, ఆవుల విసర్జితాలను అందించడంపై ఆసక్తి చూపుతున్నారు. ఈ ఎరువులు భూసారాన్ని కాపాడతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పంటకు జవసత్వాలు ఇచ్చి నాణ్యమైన దిగుబడులు పెంపుదలకు దోహదం చేస్తాయంటున్నారు. ప్రస్తుత సీజన్‌లో గొర్రెల మందలు రావడంతో పొలాల్లో నిలగడుతున్నారు. అధిక రసాయన, పురుగుమందుల వినియోగం వల్ల సారం కోల్పోయిన నేలలను సేంద్రియ ఎరువు వినియోగంతో తిరిగి సారవంతం చేయవచ్చని చెబుతున్నారు. పశువుల, గొర్రెల మూత్ర విసర్జనతో భూమిలోని చౌడు విరిగిపోతుందని, వీటి విసర్జితాలలో నత్రజని, భాస్వరం, పొటాష్‌తో పాటు సూక్ష్మపోషకాలు లభిస్తాయని రైతులు చెబుతున్నారు. మంద కట్టుతో విసర్జితాలు నేరుగా భూమిలోకి వెళ్లడంతో అధిక లాభాలు ఉంటాయని వ్యవసాయాధికారులు చెప్పారన్నారు. మంద కట్టిన తర్వాత భూమిని దుక్కు దున్నుకోవాలన్నారు. పొలాల్లో పశువులను కట్టడం ద్వారా నత్రజని, భాస్వరం, పొటాష్‌తో పాటు మేలు చేసే సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయన్నారు. తెగుళ్ల తగ్గుతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ఎండలతో అల్లాడుతున్న జనం



ముక్కామలలో నిర్మానుష్యంగా ప్రధాన రహదారి

అంబాజీపేట: మండే ఎండలకు తోడు.. తీవ్ర ఉక్కబోతతో జనం అల్లాడిపోతున్నారు. ఉదయం 8 గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపం చూపడంతో ప్రజలు రోడ్డుపైకి వచ్చేందుకు భయపడిపోతున్నారు. గత నాలుగు రోజులుగా భానుడు ఉగ్రరూపం చూపడంతో ఆదివారం ఉదయం నుంచి వేడిగాడ్పులు వీచాయి. మధ్యాహ్న సమయంలో దుకాణాలు మూసి వేశారు. చాలా మంది ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. మండుతున్న ఎండలతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. రోజురోజుకూ 42 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు అధికమవడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రాత్రి సమయంలో కూడా ఉక్కబోత, ఆరాటంగా ఉండటంతో వృద్ధులు, చిన్నారులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల ప్రధాన కూడళ్లలో చిరు వ్యాపారులు విక్రయాలు లేక ఆదాయం కోల్పోతున్నారు. ఎండల వల్ల చేతి వృత్తుల వారికి, కూలీలకు కూడా ఉపాధి లేకుండా పోతోంది. మధ్యాహ్న సమయంలో 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అంబాజీపేటతో పాటు పుల్లేటికుర్రు, ముక్కామల ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఎండలు ఇప్పుడే ఇలా ఉంటే ఈ నెల 25 నుంచి రోహిణి కార్తె ప్రారంభం కాబోతుంది. రోహిణిలో ఎండలు ఎలా ఉంటాయోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సఖినేటిపల్లి: మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1979–84 బ్యాచ్‌లలో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. సుమారు 40 ఏళ్ల అనంతరం ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనానికి కుటుంబ సభ్యులతో తరలి వచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి సదరు బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఇందులో భాగస్వామ్యమయ్యారు. జ్యోతిప్రజ్వలనను గుత్తి సుబ్బలక్ష్మి, సరెళ్ల పద్మ, కామిశెట్టి మాచరమ్మ చేశారు. డాక్టర్ ఆకుల వెంకట రామ్మోహన్‌రావు అధ్యక్షత వహించారు. నాడు ఈ సరస్వతి నిలయంలో చదువుకుని ఉన్నత స్థానాలకు వెళ్లిన పూర్వ విద్యార్థులంతా అదే పాఠశాలలో సుదీర్ఘకాలం తరువాత కలుసుకుని ఆనందపరవశులయ్యారు. అలనాటి మధురస్మృతులను నెమరు వేసుకున్నారు. వారంతా ఒకరికొకరు పరిచయాలు చేసుకున్నారు. ఆహ్లాదంగా, ఆనందంగా ఆద్యంతం గడిపారు. తరగతి గదుల్లో పాఠాలు నేర్పిన గురువులకు శాలువాలు కప్పి పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఆహ్వాన కమిటీ సభ్యులు శ్రీపాద వెంకటేశ్వర్లు, రాపాక పెద్దిరాజు, ఉప్పుగంటి నాగ మల్లేశ్వరరావు, పసలపూడి శ్రీనివాసరావు, గానాల మోహన వెంకట కృష్ణారావు, బళ్ల మహాత్మా గాంధీ, కాశిన సూరన్న, అధిక సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీఆంజనేయం.. ప్రసన్నాంజనేయం

- వాడవాడలా ఘనంగా హనుమజ్జయంతి
- భారీగా అన్నసమారాధనలు



అంతర్వేదికరలో ఆంజనేయునికి భక్తుల పూజలు



అరటిపండ్ల అలంకరణలో ఆత్రేయపురం ఆంజనేయుడు



కొత్తూరులో స్వామికి రజత కిరీటం, నాగవల్లీ దళమాల



మామిడికుదురులో హనుమజ్జయంతి పూజల్లో పాల్గొన్న భక్తులు



పోతాయిలంక శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో గణపతి హోమం నిర్వహిస్తున్న భక్తులు

మామిడికుదురు: హనుమజ్జయంతి వేడుకలను ఆదివారం గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల వద్ద పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంధ సింధూరం, తమలపాకులు, గారెలతో ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. మామిడికుదురు శివకేశవుల ఆలయ ప్రాంగణంలోని అభయాంజనేయస్వామికి 11 రకాల ద్రవ్యాలతో ఏకాదశాహుతుల అభిషేకం, స్వామి వారికి విశేషార్చన ఘనంగా నిర్వహించారు. కంచివారిపాలెం ఆలయం వద్ద 13వ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. కట్టా నాగరాజు–మంగాదేవి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. పాశర్లపూడిలంకలో లక్ష తమలపాకుల పూజ జరిగింది. మండలంలోని అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడిలంక, పాశర్లపూడి, నగరం, మొగలికుదురు దితర గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల వద్ద హనుమజ్జయంతి వేడుకలను వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా పలు ఆలయాల వద్ద భారీ అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు.

ఆత్రేయపురం: మండలంలోని గ్రామాల్లో హనుమత్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని ఆత్రేయపురం, బొబ్బర్లంక, మెర్లపాలెం, లొల్ల, ర్యాలి, నార్కెడ్‌మిల్లి, అంకంపాలెం తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు ఆలయాల్లో అర్చకులు అఖండ దీపారాధన, తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. హనుమత్ జయంతి వేడుకల్లో భాగంగా ఆలయాల వద్ద ఏకాహం నిర్వహించారు. ఆత్రేయపురంలోని హనుమాన్‌ను వివిధ రకాల అరటి పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ నిర్మాత పాతపాటి వెంకట సత్యనారాయణరాజు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆత్రేయపురంలో అభయహస్త ఆంజనేయుని ఆలయం వద్ద సాగిరాజు సూర్యతేజ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర పంచారు.

సఖినేటిపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆంజనేయస్వామి, రామాలయాల్లో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. సుమారు వారం రోజుల పాటు విశేష కార్యక్రమాల నిర్వహణకు అర్చకులు శ్రీకారం చుట్టారు. మోరి ప్రసన్నాంజనేయ స్వామి, మోరి శ్రీరామభక్తాంజనేయ స్వామి, టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద, అంతర్వేది రోడ్డు సెంటర్ వద్ద, అంతర్వేదికర సెంటర్ వద్ద ఉన్న ఆంజనేయస్వామి వారి ఆలయాల్లో మొదటి రోజు వేకువజామున అర్చకులు కలశ స్థాపన మహోత్సవం చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. మోరి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో కుంచే దుర్గారావు దంపతులు, అంతర్వేదికరలో మాజీ సర్పంచ్ పోతురాజు నాగేంద్రకుమార్ దంపతులు కలశ స్థాపనలు చేశారు.

అంబాజీపేట: మండలంలో హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంబాజీపేట పశువుల మార్కెట్‌లో అభయాంజనేయస్వామి, పెద్దవీధిలోని నాగమల్లె చెట్టు వద్ద ఉన్న దాసాంజనేయ స్వామి, గంగలకుర్రు అగ్రహారం ముషిణివారిపాలెం హనుమాన్ సెంటర్‌లోను, ఇరుసుమండలోని భక్తాంజనేయ స్వామి, వ్యాఘ్రేశ్వరం, మాచవరం, గంగలకుర్రు, వక్కలంక, ముక్కామలలో ఆంజనేయ స్వామికి లక్ష తులసి, తమలపాకుల పూజ, సింధూర పూజలు నిర్వహించారు. పోతాయిలంకలో భక్తాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, గణపతి హోమం నిర్వహించారు. ఆయా ఆలయ ప్రాంగణాల వద్ద భారీ అన్నసమారాధన జరిపారు.

పి.గన్నవరం: హనుమజ్జయంతి సందర్భంగా మండలంలోని ఆంజనేయుని ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వేంచేసిన పంచముఖ ఆంజనేయుని ఆలయంలో కమిటీ చైర్మన్ పడాల సూపర్ ఆధ్వర్యంలో హనుమజ్జయంతిని నిర్వహించారు. రాత్రి భక్తులకు అన్న సమారాధన చేశారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలు జరిగాయి. వేకువజామున భక్తులు పుణ్యస్నానమాచరించి హనుమాన్ ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు. కొత్తూరు సెంటర్‌లో వేంచేసిన సీతారామాంజనేయస్వామి ఆలయంలో భక్తుల బృందం సుమారు రూ.లక్షతో తయారు చేయించిన హనుమంతునికి రజత కిరీటం, నాగవల్లీ దళ మాలను సమర్పించారు. స్థానిక భాస్కర హోటల్‌కు చెందిన పసుపులేటి జ్యోత్స్న, నాగ ప్రజ్ఞకుమారి, గణపతి సూర్య భాస్కర్ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది. అలాగే పలు ఆలయాల్లో నిర్వహించిన ఏకాహ, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

అయినవిల్లి: స్థానిక దాసాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి పూజలు ఘనంగా జరిపారు. స్వామికి తమలపాకులు, సింధూరంతో ప్రత్యేక పూజలు చేశారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.

పలివెలలో పేదలకు దుప్పట్ల పంపిణీ



పలివెలలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ గంగాధరరావు, మారుతీ బంగారం

కొత్తపేట: శ్రీరామభక్త ఆంజనేయస్వామి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని వాడవాడలా ఆంజనేయస్వామి ఆలయాలు, రామాలయాల్లో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. పలివెలలో అభయాంజనేయస్వామికి ఆలయ ఫౌండర్ వీవీఎస్ఎన్ మారుతిబంగారం–సుబ్బలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, తమలపాకుల పూజ తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ మార్గన గంగాధరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎంపీపీ చేతుల మీదుగా మారుతీబంగారం సుమారు 100 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. భారీ ఎత్తున అన్నసమారాధన జరిపారు. అలాగే కొత్తపేటలో బృహన్మూర్తి భక్తాంజనేయస్వామికి ఉత్సవ కమిటీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోడిపాలెం వంతెన వద్ద భక్తాంజనేయస్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు ఖండవిల్లి పాండురంగాచార్యులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లోని ఆంజనేయస్వామి వారి ఆలయాల్లో హనుమ జన్మదినోత్సవం కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. పలు ఆలయాల వద్ద అన్నసమారాధన జరిపారు. అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పేదలకు సీఎంఆర్‌ఎఫ్ ఆర్థిక సాయం



నగరంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించి వారిని ఆదుకుంటున్నామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. నగరంలో ఆదివారం క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే చిట్టిబాబు పి.గన్నవరం మండలం ఆర్.ఏనుగుపల్లికి చెందిన దొమ్మేటి వెంకటశివరామన్‌కు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.1.20 లక్షల చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ వర్తించని వారికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సహాయం అందించి వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారునాయుడు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, పార్టీ నేతలు పితాని నర్సింహారావు, కొక్కిరి రవికుమార్, నాగాబత్తుల చంటి, గంధం ఏసుబాబు పాల్గొన్నారు.

ఘనంగా మాతృ దినోత్సవం

సఖినేటిపల్లి: మండలంలోని వీవీ మెరక శివారు కేవీ పోడులో స్థానిక బ్రాంచి పోస్టాఫీసులో బీపీఎం బషీరున్నీసా బేగం, పోస్ట్‌మేన్ కె.ఇమ్మానియేల్ రాజు ఆధ్వర్యంలో ఆదివారం మదర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఆమె ఏర్పాటు చేసిన మదర్స్ డే కేక్‌ను తల్లుల సమక్షంలో కట్ చేశారు. అనంతరం వారిని బీపీఎం బేగం సత్కరించారు. ఆమె మాట్లాడుతూ, భారతీయ పోస్టల్ శాఖ కొత్తగా ప్రవేశపెట్టిన మహిళా సమ్మాన్ సేవింగ్స్ (ఎంఎస్‌ఎస్‌సీ) సర్టిఫికెట్స్, ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై), గ్రామీణ తపాలా జీవిత బీమా(ఆర్‌పీఎల్ఐ) వినియోగించుకోవాలని సూచించారు. గుడిమెళ్లంక బీపీఎం ఝాన్సీ, తాహీరాభాను, జి.అమెనా, వనిత, కృష్ణవేణి, వజ్రం, అంజనీకుమారి, రాణి పాల్గొన్నారు.

మలికిపురం: స్థానిక ప్రముఖ చిత్రకారుడు ఎస్.సంగీత అమ్మ ప్రేమ గురించి గీసిన చిత్రాలను ఆదివారం సునయన ఆర్ట్స్ అకాడమీలో విద్యార్థినీ, విద్యార్థులతో ప్రదర్శించారు. ఆయన గీసిన చిత్రాలు స్థానికులను ఆకట్టుకున్నాయి. సృష్టికి మూలం అమ్మ అని ఆయన అన్నారు.

కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్షల్లో 898వ ర్యాంకు

ఆలమూరు : మండలంలోని పెదపళ్లకు చెందిన నామాల మెహెర్ చైతన్య జాతీయ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పోటీ పరీక్షల్లో అత్యుత్తమ 898వ ర్యాంకు సాధించాడు. శనివారం రాత్రి ఈ ఫలితాలు విడుదలైనట్లు ఆయన ఆదివారం తెలిపారు. ఈ ర్యాంకుతో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో అత్యుత్తమ సంస్థగా పేరొందిన కాగ్‌లో ఉద్యోగం సంపాదించాడు. 2017లో స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌కు, 2019లో ఇన్‌కమ్ ట్యాక్స్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పొందాడు. వరుస ర్యాంకులతో ఉన్నత ఉద్యోగం సాధించిన మెహెర్ చైతన్యను పలువురు అభినందించారు.

పీజీ వైద్య ప్రవేశ పరీక్షలో 'వాసుకి' ప్రతిభ

మామిడికుదురు: కేంద్రీయ విశ్వ విద్యాలయాల పీజీ వైద్య ప్రవేశ పరీక్షలో మామిడికుదురుకు చెందిన డాక్టర్ ధూళిపూడి వెంకట సత్యవాసుకి ఉత్తమ ప్రతిభ చూపింది. ఇటీవల ఎయిమ్స్ నిర్వహించిన ఇన్నిసెట్-2023 ప్రవేశ పరీక్షలో ఆమెకు జాతీయ స్థాయిలో 472వ ర్యాంకు లభించింది. ఈ ఫలితాలు శనివారం రాత్రి విడుదలయ్యాయి. విశాఖపట్నం గాయత్రి వైద్య కళాశాలలో ఆమె ఎంబీబీఎస్ పూర్తి చేసింది. ప్రస్తుతం వాసుకి వైద్య రంగంలో ఎండీ జనరల్ మెడిసిన్ కోర్సు అభ్యసిస్తోంది. ఇటీవల విడుదలైన నీట్ పీజీ పరీక్షలో కూడా వాసుకి జాతీయ స్థాయిలో 2,083వ ర్యాంకు సాధించింది.